

నల్లగొండ

సత్యనిష్ఠ

నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి

29 గురువారం అక్టోబర్ 2026 పేజీలు: 3


## రోడ్డు ప్రమాద బాధితుడిని పరామర్శించిన ఎమ్మెల్యే బాలు నాయక్



**చందంపేట-అక్టోబర్ 28 సత్యనిష్ఠ ప్రతినిధి:** చందంపేట మండలం కంబాలపల్లి గ్రామానికి చెందిన ముంగి వెంకటయ్య కుమారుడు ముంగి శివ రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ మలక్‌పేట యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. శివ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. శివ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట ఏద్దుల గోవిందు యాదవ్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన రైతులకు అండగా కృషి విజ్ఞాన కేంద్రం

**యాసంగి కూరగాయలు, మిరప సాగుపై శిక్షణ.. 20 మంది రైతులకు ఉచితంగా నారు మొక్కల పంపిణీ**



**సత్యనిష్ఠ ఆర్ సి హుజూర్నగర్ గరిడేపల్లి:** గిరిజన రైతుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించడంతో పాటు, శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన కల్పించే లక్ష్యంతో సూర్యాపేట జిల్లా గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ఆధ్వర్యంలో యాసంగి కూరగాయలు, మిరప సాగుపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐసీఏఆర్--అటారి, జోన్-, హైదరాబాద్ సహకారంతో గిరిజన ఉప ప్రణాళిక (టీఎస్పీ) కింద నిర్వహించిన ఈ కార్యక్రమంలో బొట్యా తండాకు చెందిన 20 మంది గిరిజన రైతులకు ఉచితంగా కూరగాయలు, మిరప నారు మొక్కలను పంపిణీ చేశారు.
ఈ సందర్భంగా కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త సీహెచ్ నరేష్ మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గి నీటి కొరత ఏర్పడే అవకాశాలు ఉన్నందున రైతులు నీటి పొదుపు పద్ధతులను అనుసరించాలని సూచించారు. బిందు సేద్యం, మల్చింగ్ విధానాలను అవలంబించడం ద్వారా నీటిని ఆదా చేయడంతో పాటు కలుపు మొక్కల సమస్యను తగ్గించుకోవచ్చని వివరించారు. కూరగాయలు, మిరప పంటల్లో సమతుల్య ఎరువుల వినియోగం, సమగ్ర సస్యరక్షణ పద్ధతులు, చీడపీడల నివారణకు శాస్త్రీయ యాజమాన్య పద్ధతుల ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. భూమి స్వభావం, నీటి లభ్యతకు అనుగుణంగా పంటలను ఎంపిక చేసుకొని సాగు ఖర్చులను తగ్గించుకుంటూ నాణ్యమైన దిగుబడులు సాధించాలని సూచించారు.
20 మంది రైతులకు ఉచితంగా నారు మొక్కలు ఆత్మకూరు (ఎస్) మండలం బొట్యా తండాకు చెందిన 20 మంది గిరిజన రైతులకు టమాటా, వంకాయ, పచ్చిమిరప, ఎర్రమిరప పంటల సాగు కోసం నారు మొక్కలను ఉచితంగా పంపిణీ చేశారు. ఒక్కో రైతు అర ఎకరం చొప్పున సాగు చేసుకునేలా మొక్కలను అందించి, మొత్తం సుమారు 10 ఎకరాల్లో సాగుకు ప్రోత్సాహం కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే గడ్డిపల్లి సస్యరక్షణ శాస్త్రవేత్త డి. ఆదర్శ్, గృహ విజ్ఞాన విభాగం కార్యక్రమ సహాయకురాలు ఎన్. సుగంధి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. గిరిజన రైతులకు నాణ్యమైన నారు మొక్కలను అందించడం, శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన పెంపొందించడం, నీటి పొదుపు విధానాలను ప్రోత్సహించడం ద్వారా రైతుల జీవనోపాధిని మెరుగుపరచడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

## గ్రాడ్యుయేట్ ఓటరు నమోదుపై విద్యావంతుల నిర్లక్ష్యం..

- **బీసీ సంఘం నేత బెల్లంకొండ నవీన్ గౌడ్ ఆవేదన**
- **మరో తొమ్మిది రోజులే గడువు.. నవంబర్ 6 చివరి తేదీ.**

**పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి**



**కోదాడ - అక్టోబర్ 28 (సత్యనిష్ఠ)** తెలంగాణ రాష్ట్రంలో విద్యా వంతులకు వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియ నవంబర్ 6 వరకు మరో తొమ్మిది రోజులే గడువు మిగిలి ఉన్న నేపథ్యంలో, విద్యావంతులు ఓటరుగా నమోదు చేసు కోవడానికి ఆశించిన స్థాయిలో ఆసక్తి చూపడం లేదని అన్నారు. ఓటరు నమోదుపై అవగాహన కల్పించేందుకు అధికార, ప్రతి పక్ష పార్టీల నాయకులు సైతం గ్రామ గ్రామాన తిరిగి పట్టభద్రులు తమ పేర్లను నమోదు చేసు కోవాలని విజ్ఞప్తి చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సమాజంలో మార్పును కోరుకునే విద్యావంతులు, మేధావులు ప్రజాస్వామ్య ప్రక్రియలో చురుకుగా పాల్గొనాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. విద్యావంతులు, మేధావులు మౌనంగా ఉంటే ప్రజా స్వామ్యానికి నష్టం జరుగుతుంది. ప్రభుత్వాలు ప్రజల గొంతుకను వినాలంటే ఓటు అనే ఆయుధాన్ని సమర్థంగా వినియోగించు కోవాలి. నాయకులు ప్రజల సమస్యలపై స్పందించేలా చేయడంలో ఓటు కీలక పాత్ర పోషిస్తుంది. అలాంటప్పుడు పట్టభద్రులు ఓటరు నమోదుకు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారో అర్థం కావడం లేదు. అని నవీన్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా స్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి పట్టభద్రుడు తన బాధ్యతను గుర్తించి ఓటరుగా నమోదు చేసు కోవాలని కోరారు. వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో అర్హులైన పట్ట భద్రులందరూ గడువు లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకొని, ప్రజాస్వామ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని బెల్లంకొండ నవీన్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

## అడ్మిషన్లకు అవసరమైన సర్టిఫికెట్లను అందజేత

- **విద్యార్థిని శివర్ల ధరణి ఉన్నత విద్యకు చేయూత..**
- **6 వార్డు బి ఆర్ ఎస్ పార్టీ ఇంచార్జ్ భూక్య రాంబాబు..**



**మిర్యాలగూడ,సత్యనిష్ఠ, అక్టోబర్ 28 :** పట్టణంలోని 6వ వార్డు ఇందిరమ్మ కాలనీకి చెందిన శివర్ల ధరణి ఐ/శీ యాదగిరి బీఎస్సీ అగ్రికల్చర్‌లో సీటు లభించడంతోఅడ్మిషన్‌కు అవసరమైన సర్టిఫికెట్లను సిద్ధం చేయించి ఆమెకు అందించడం జరిగింది. విద్యార్థిని ఉన్నత విద్యను అభ్యసించేందుకు అవసరమైన సహాయం అందించడం ఎంతో సంతోషంగా ఉంది. విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలవడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు.

## ఆర్నాబ్ తుఫాన్‌తో మండల రైతులు ఆగమాగం

**బిఆర్ఎస్ మండల సమన్వయ కమిటీ సభ్యులు అనంతుల ఆంజనేయులు**



**కోదాడ-అక్టోబర్ 28 (సత్యనిష్ఠ)** ఎల్ నినో ప్రభావంతో కరెంటు సమస్యతో సగం పంటలు ఎండిపోగా మిగిలిన సగం పంటలు చేతికి అందే సమయానికి ఆర్నాబ్ ప్రభావంతో చేతికి అందిన ధాన్యం తడిసి ముద్దవగా ఉన్న పంట పొలాలు నేలకొరిగి రైతు నడ్డి విరిచాయని తక్షణమే రైతులకు టార్పాలనులను అందించటంతో పాటు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి మద్దతు ధర ఇవ్వాలని నేల కొరిగిన పంటలకు పరిశీలన చేసి రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని తక్షణమే మండలాన్ని తీవ్రమైన కరువు మండలంగా జాబితాలో చేర్చి మండల ప్రజలను ఆదు కోవాలని బిఆర్ఎస్ మండల సమన్వయ కమిటీ సభ్యులు అనంతుల ఆంజనేయులు డిమాండ్ చేసినారు. లేని యెడల, మొద్దు నిద్రపోతున్న ప్రభుత్వాన్ని మేల్కొనపటానికి మండల బిఆర్ఎస్ పార్టీ తరపున ధర్నాలు, రాస్తారోకోలు, బందులు, నిరాహార దీక్షలు చేసి నడిగూడెం మండలాన్ని తీవ్రమైన కరువు మండలం గా ప్రకటించే వరకు పోరాడతామన్నారు.

## తిరుపతమ్మకు నివాళులు..!



**మిర్యాలగూడ, సత్యనిష్ఠ, అక్టోబర్ 28:** పట్టణం లోని 6వ వార్డు ఇందిరమ్మ కాలనీకి చెందిన తిరుపతమ్మ అనారోగ్యంతో బాధపడుతూ ఈరోజు మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ఇందిరమ్మ కాలనీ మన రాంబాబు వారి పార్థివ దేహాన్ని సందర్శించి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్పార్టీ బీసీ సెల్ వార్డు అధ్యక్షులు పులిపలుపుల శ్రీనివాస్ గౌడ్, కావలి వెంకన్న, మేఘన, తిరుపతమ్మ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయండి

### మాజీ మండల పార్టీ అధ్యక్షులు గుగులోతు కృష్ణ నాయక్



సత్య నిష్ఠ ఆర్ సి హుజుర్నగర్ గరిడేపల్లి: నల్గొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని గరిడేపల్లి మాజీ మండల పార్టీ అధ్యక్షులు గుగులోతు కృష్ణ నాయక్ కోరారు. ఈరోజు గరిడేపల్లి మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ నేడు హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని లక్ష్మీ నరసింహ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్‌చార్జి కంచర్ల కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, హుజూర్‌నగర్ నియోజకవర్గ యువ నాయకులు పిల్లుట్ల రఘు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గరిడేపల్లి మండల పరిధిలోని అన్ని గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, ముఖ్య నాయకులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లు ప్రతి గ్రామం నుంచి అధిక సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని గుగులోతు కృష్ణ నాయక్ విజ్ఞప్తి చేశారు.

## కోదాడ హాస్పటల్లో మొక్క వెంకన్నకు పరామర్శ

### కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు, పందిరి నాగిరెడ్డి



కోదాడ - అక్టోబర్ 28 (సత్యనిష్ట) కోదాడ పట్టణం లోని సురేష్ ఆర్థోపెడిక్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న మొక్క వెంకన్నను పార్మర్శించిన కోదాడ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకులు పందిరి నాగిరెడ్డి. కోదాడ నియోజకవర్గంలోని మోతె మండలం ఉర్లుగొండ గ్రామ సర్పంచ్ మొక్క వెంకన్న మంగళవారం సాయంత్రం బరాకత్ గూడెం వద్ద ఆక్సిడెంట్ కు గురి కావడం, ఎడమ కాలు విరిగిన విషయం తెలుసుకున్న కోదాడ నియోజక వర్గ కాంగ్రెస్ నాయకులు పందిరి నాగిరెడ్డి, యం యస్ విద్యా సంస్థల సీ ఈ వో, యస్ యస్ రావు లు పలువురు కోదాడ లోని సురేష్ ఆర్థో పెడిక్ హాస్పిటల్ లో బాధితుని పరామర్శించారు. ఈ సందర్భంగా పందిరి నాగిరెడ్డి డాక్టర్ తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కుటుంబానికి అండగా నిలుస్తామని అన్నారు. ఆపదలో ఉన్న వారిని అక్కున చేర్చుకోవడం అండగా నిలబడడం మంచి పరిణామం అని సర్పంచ్ మొక్క వెంకన్న బంధువులు, స్నేహితులు పలువురు ఎమ్మెస్ విద్యా సంస్థల చైర్మన్, కోదాడ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పందిరి నాగిరెడ్డిని అభినందించారు.

# జూపిటర్ వెంచర్ ల్యాండ్స్ క్వారీకి ప్రజాభిప్రాయ సేకరణలో అనుకూల స్పందన

- **పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి.. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి**





**యాదాద్రి భువనగిరి జిల్లా, అక్టోబర్ 28-సత్యనిష్ఠ ప్రతినిధి:** బొమ్మలరామారం మండలం తిరుమలగిరి గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 72లో ప్రతిపాదించిన ఎం/ఎస్ జూపిటర్ వెంచర్ ల్యాండ్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన 10 హెక్టార్ల రఫ్ స్టోన్ అండ్ రోడ్ మెటల్ క్వారీ ప్రాజెక్టుపై నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా పలువురు ప్రాజెక్టుకు అనుకూలంగా మాట్లాడుతూనే పర్యావరణ పరిరక్షణ, స్థానిక ప్రజల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాయింట్ కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి పాల్గొని వినతులు స్వీకరించారు. కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) ఈఈ వెంకన్న, కంపెనీ యాజమాన్య ప్రతినిధులు, గ్రామస్తులు, ఎన్జీవో ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన గ్రామస్తులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు క్వారీ కార్యకలాపాల వల్ల ప్రజలకు, పర్యావరణానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా దుమ్ము, ధూళి వ్యాప్తిని నియంత్రించడం, గాలి కాలుష్యం రాకుండా చర్యలు చేపట్టడం, నీటి వనరులు కలుషితం కాకుండా చూడటం, పరిసర ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించేందుకు విస్తృతంగా మొక్కలు నాటాలని కోరారు. అదేవిధంగా కంపెనీ కార్యకలాపాల్లో స్థానిక యువతకు ప్రాధాన్యం ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, గ్రామ అభివృద్ధికి తోడ్పడే కార్యక్రమాలు చేపట్టాలని అభిప్రాయపడ్డారు. క్వారీ నిర్వహణలో పర్యావరణ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ, ప్రజల ఆరోగ్యం మరియు భద్రతకు భంగం కలగకుండా చూడాల్సిన బాధ్యత కంపెనీ యాజమాన్యం పై ఉందని పేర్కొన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా వ్యక్తమైన సూచనలు, అభిప్రాయాలను సంబంధిత అధికారులు పరిగణనలోకి తీసుకోవాలని, పర్యావరణ పరిరక్షణ చర్యలు సమర్థవంతంగా అమలయ్యేలా పర్యవేక్షించాలని పలువురు కోరారు. పర్యావరణ పరిరక్షణే ప్రథమ లక్ష్యం కావాలిక్వారీ ప్రాజెక్టు ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు లభించడంతోపాటు, పరిసర గ్రామాల ప్రజలకు ఎలాంటి కాలుష్య సమస్యలు తలెత్తకుండా కంపెనీ యాజమాన్యం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రజలు సూచించారు. అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, పర్యావరణ పరిరక్షణ సమన్వయంతో ముందుకు సాగినప్పుడే స్థానిక ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయపడ్డారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో జూపిటర్ వెంచర్ ల్యాండ్స్ యాజమాన్యం, ఎన్జీవోలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేతకు ఈటల పాదయాత్ర - బీసీ జేఏసీ మద్దతు




**హైదరాబాద్, అక్టోబర్ 28-సత్యానిష్ఠ ప్రతినిధి:**జవహర్‌నగర్ చెత్త డంపింగ్ యార్డును ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ చేపట్టిన పాదయాత్రకు బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి బీసీ జేఏసీ తరఫున సంఘీభావం తెలిపారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు కారణంగా స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఈ సమస్య పరిష్కారానికి సంబంధిత అధికారులు, ప్రభుత్వ పెద్దలు తక్షణమే స్పందించాలని కోరారు. ప్రజల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ డంపింగ్ యార్డును తొలగించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు.

## పట్టభద్రుల ఓటరు నమోదులో నిబంధనలు పాటించాలి - తహసీల్దార్‌కు జనసేన వినతి



**ముదిగొండ, అక్టోబర్ 28 - సత్యానిష్ఠ ప్రతినిధి:** ముదిగొండ మండల తహసీల్దార్ రవి కుమార్‌ను జనసేన పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు. నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై అభ్యంతరాలను తెలియజేస్తూ, నిజమైన పట్టభద్రులకు ఓటరు నమోదులో ఎటువంటి అన్యాయం, ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు అనుముల నరేష్, ఓరుగంటి ఈశ్వర్, మొహమ్మద్ ఫరీద్, వనం నరసింహారావు, శివరాత్రి కళ్యాణ్, చెరుకుపల్లి ప్రసాద్, వార సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ఛాయా సోమేశ్వరాలయ అభివృద్ధికి ప్రణాళిక

- **అధికారులతో కలిసి పనులు పరిశీలిస్తున్న మేయర్**

**నల్లగొండ, అక్టోబర్ 28 (సత్య నిష్ఠ):** పానగల్ ఛాయాసోమేశ్వరాలయాన్ని అభివృద్ధి చేసి, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి సూచించారు. రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం ఆమె ఆలయాన్ని సందర్శించి, ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 కోట్లతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలోని కోనేరుకు అన్ని వైపులా మెట్ల నిర్మాణం, వేనుకవైపు నుంచి భక్తులు రాకపోకలు సాగించేందుకు రహదారి ఏర్పాటు తదితర అంశాలపై చర్చించారు. నిధులను సద్వినియోగం చేసుకుంటూ పనులను ప్రణాళికాబద్ధంగా



పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఛాయా సోమేశ్వరాలయం జిల్లాకు చారిత్రక, ఆధ్యాత్మిక గుర్తింపుగా నిలుస్తుందని పేర్కొన్నారు. పీజీ కళాశాల నుంచి అండింగ్ రహదారి మీదుగా జాతీయ రహదారి 565 వరకు చేపట్టాల్సిన రోడ్డు పనులపై కూడా చర్చించారు. సాగర్ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో వైఎస్సీ విగ్రహం నుంచి వైద్య కళాశాల మీదుగా చర్లగూడెం రోడ్డు వరకు డివైడర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మంత్రి ఆదేశాల మేరకు ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, మొదటి డివిజన్ కార్పొరేటర్ ఆలకుంట్ల నాగరాజు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, ఆలయ చైర్మన్ కోడదెల ఎల్లయ్య, పల్ రెడ్డి వెంకట్ రెడ్డి, గుండగోని యాదయ్య గౌడ్, గురజాల నరేందర్, గుండగోని శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి: బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్



**హైదరాబాద్,అక్టోబర్ 28- సత్యనిష్ఠ ప్రతినిధి:** ఆరుగాలం కష్టపడి, ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి పంటలు సాగు చేసిన రైతులకు పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షాలు తీవ్ర నష్టాన్ని కలిగిస్తున్నాయని, పంట నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.వరి పంట కోతకు వచ్చిన సమయంలో ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలు కురవడంతో రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో వరి పంట నేలకొరిగి, రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెట్టుబడుల కోసం అప్పులు చేసి, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, కూలీల ఖర్చులు భరించిన రైతులకు ఈ పంట నష్టం మరింత ఆర్థిక భారంగా మారిందని పేర్కొన్నారు.ప్రభుత్వ అధికారులు వెంటనే క్షేత్రస్థాయిలో పర్యటించి, అకాల వర్షాల వల్ల జరిగిన పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేయాలని కోరారు.




# దివ్యాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్**

**హైదరాబాద్,అక్టోబర్ 28-సత్యనిష్ఠ ప్రతినిధి:** దివ్యాంగులకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ డిమాండ్ చేశారు. సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు కె.వి. గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని దివ్యాంగుల సహకార సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన ధర్నాలో ఆయన పాల్గొని సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా లింగం గౌడ్ మాట్లాడుతూ దివ్యాంగులు సమాజంలో అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారి సంక్షేమం, ఆర్థిక భద్రత, ఉపాధి అవకాశాలు, గౌరవప్రదమైన జీవనం కోసం ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా దివ్యాంగులను నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదన్నారు. దివ్యాంగులకు అందాల్సిన సంక్షేమ పథకాలు, ఆర్థిక సహాయం, ఉపాధి అవకాశాలను సకాలంలో అందించాలని, వారి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.